
సాక్షి
పల్నాడు
7
ఆదివారం । 30 । మార్చి । 2025



కోదండరాముడిగా నృసింహుడు
మంగళగిరి టౌన్: ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి శనివారం కోదండరాముడిగా దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నేటి నుంచి వసంత నవరాత్రోత్సవాలు
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)
నరసరావుపేట	6.27
గుంటూరు	6.25
బాపట్ల	6.25

శ్రీ విశ్వావసు.. శుభమస్తు

వసంత మాసం ప్రారంభాన.. లేత చిగురు కొమ్మలపై కుహూ కుహూ అంటూ వినిపించే కోయిలల కమ్మనిగానం.. మామిడి పిందెలు, వేప పువ్వు తదితర షడ్రుచుల కలయికతో తయారయ్యే పచ్చడి నేర్పే జీవిత పాఠం.. రాబోయే ఏడాదిలో జరగబోయే మంచీ, చెడులు, భవిష్యత్తు గురించి చేసే పంచాగ శ్రవణం.. ఇవన్నీ తెలుగువారి ప్రథమ పర్వదినమైన ఉగాది ప్రత్యేకతలు. కొత్త ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలతో తెలుగు నూతన ఏడాదికి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అందరి జీవితాల్లో శుభాలు నింపాలని ఆకాంక్షించారు.

నేడు ఉగాది పర్వదినం

- కొత్త ఆశలతో తెలుగు నూతన సంవత్సరాదికి స్వాగతం
- షడ్రుచుల సంగమం ఉగాది పచ్చడి
- పంచాంగ శ్రవణం తెలుగువారి ప్రత్యేకం
- శ్రీ విశ్వావసు నామ సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు



సత్తెనపల్లి: జిల్లా ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో శ్రీ విశ్వావసునామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఉగాది వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేశారు. ఉగాది రోజున కొత్త పనులు ప్రారంభించడం, ఉగాది నాడు పంచాంగ పఠనం నిర్వహించడం ఓ ప్రత్యేకత. తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలు సంస్థలు, దేవస్థానాలు, ప్రముఖులు పండితులతో పంచాంగ పఠనం నిర్వహిస్తారు. జన్మ నక్షత్రం లేదా నామ నక్షత్రం ఆధారంగా వ్యక్తిగత జీవిత అంశాలు, వారి ఆదాయ, వ్యయాలతో పాటు సమాజం, రాష్ట్రం, దేశం పోకడలు, రాజకీయాలు తదితర అంశాలను విశ్లేషిస్తూ పంచాంగ పఠనం చేస్తారు. ఆ సందర్భంగా దాదాపు ప్రతి ఒక్కరూ తమ జాతక ఫలితాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఉగాది వసంత రుతువు ఆగమనం ప్రారంభమైన రోజు. ఈరోజు షడ్రుచులతో చేసిన పచ్చడి తింటారు. ఇక ఆలయాలు, మాధ్యమాల్లో పండితులు వినిపించే పంచాంగానికి పలువురు ప్రాధాన్యత ఇస్తారు.

కొత్త ఆశలు, ఆశయాలకు పునాది



కాలంలో వచ్చే మార్పులకు ఇది నాంది. మోడు వారిన ప్రకృతి చిగురించే కాలం ఇది. జీవితంలో కొత్త ఆశలకు, ఆశయాలకు పునాది ఈ ఉగాది. ఇది తెలుగువారికి విశేషమైన పండుగ. అందుకే కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వర స్వామికి కూడా ఉగాది ఆస్థానం పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు.

– కూనాగు వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి

ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యం



ఉగాది పచ్చడి రుచులలో ఒక్కో దానికి ఒక అర్థం ఉంది. ఉప్పు మన జీవితంలో ఆనందం, రుచికి సంకేతంగా పరిగణిస్తారు. పులుపు తెలివిగా వ్యవహరించాల్సిన పరిస్థితులను తెలియజేస్తుంది. చేదు బాధను దిగమింగాలని లేదా భరించాలని సూచిస్తుంది. తీపి సంతోషానికి ప్రతీక. కారం సహనం కోల్పోవడానికి సూచిస్తుంది. పచ్చిమామిడి ముక్కల్లో తగిలే వగరు రుచి కొత్త సవాళ్లను ఎదుర్కోవడం గురించి తెలియజేస్తుంది.

– పి.వెంకటలక్ష్మి, సత్తెనపల్లి

పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం



ఉగాది రోజున పంచాంగ శ్రవణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ఏడాది వర్షాలు.. ఏ ఏ పంటలు పండే అవకాశం ఉందో తెలుసుకోవచ్చు. ఈరోజు తలంటు స్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇష్టదైవాన్ని పూజించాలి. ఆలయాలను దర్శించుకుని ఉగాది పచ్చడి స్వీకరిస్తే మంచి జరుగుతుంది. పంచాంగ శ్రవణం ద్వారా అరిష్టాలు తొలగి శుభదాయకంగా ఉంటుంది. ఉగాది పండుగ రోజే కొత్తదస్త్రాలను రాయడం ప్రారంభించాలి.

–వెలిదండ్ల హనుమత్ స్వామి, పీఠాధిపతి, సత్తెనపల్లి

తెలుగువారికి ప్రధానమైన పండుగ



తెలుగు ప్రజలకు సంవత్సరాది ఉగాది పండగే. రుతువులను అనుసరించి ఈ ఏడాది శ్రీ విశ్వావసు నామ సంవత్సరం. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది కనుక ఇది తెలుగువారి మొదటి పండుగ. ఈరోజు నుంచి వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. ప్రతీ తెలుగు కుటుంబం ఈ ఉగాది పండుగను విధిగా జరుపుకోవాలి. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంతో అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలి.

–మాదా మల్లికార్జునరావు, అధ్యక్షుడు, అభ్యుదయ విజ్ఞాన సమితి, సత్తెనపల్లి

ఏప్రిల్ 1న 'పది' సోషల్ పరీక్ష

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ సెలవును ఈనెల 31వ తేదీన ప్రకటించిన నేపథ్యంలో పదవ తరగతి సాంఘిక శాస్త్రం పరీక్షను వాయిదా వేసి, ఏప్రిల్ 1వతేదీన నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పరీక్ష తేదీ మార్పును జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు, పరీక్షా కేంద్రాల సీఎస్, డీఓలతో పాటు పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న సిబ్బందికి తెలియచేస్తున్నామన్నారు.

3 నుంచి మూల్యాంకనం..

పదవ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శనివారం తెలిపారు. పట్టణంలోని కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల ప్రాంగణంలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మూల్యాంకన ప్రక్రియను ఏడు రోజుల్లో పూర్తిచేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారనీ ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. మూల్యాంకనంలో 111 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 651 మంది ఎగ్జామినర్లు, 270 మంది స్పెషల్ అసిస్టెంట్లును నియమించామన్నారు. ప్రతిరోజు ఒక్కో ఎగ్జామినర్ 40 జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలని, వాటిలో 20 పేపర్లు చొప్పున చీఫ్ ఎగ్జామినర్ పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ ఎగ్జామినర్లు మూల్యాంకనం చేసిన వాటిలో రెండు చొప్పున, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ రోజుకు 45 చొప్పున, క్యాంప్ ఆఫీసర్ 20 చొప్పున పరిశీలించాలని వివరించారు. పరిశీలనలో మార్కుల్లో వ్యత్యాసం వస్తే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పదవ తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

న్యూస్‌రీల్

కొనసాగిన కేంద్ర బృందం పర్యటన



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్ళూరు ప్రాథమిక వైద్యశాలలో రెండవ రోజు శనివారం కేంద్ర బృందం పరిశీలన కొనసాగింది. బృందం సభ్యులు డాక్టర్ పరిమళ జగస్, డాక్టర్ భద్రకాంత్ శర్మలు ఎన్‌క్యూఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు)లో భాగంగా కాన్పుల గది, అవుట్ పేషేంట్, ఇన్ పేషేంట్, ల్యాబ్ గదులు, నేషనల్ హెల్త్ కార్యక్రమాలు, జనరల్ మెయింటెనెన్స్ రికార్డులను పరిశీలించారు. అనంతరం బలుసుపాడు, జలాల్‌పురం గ్రామాల్లో పర్యటించి గ్రామ స్థాయిలో ఉప ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పరిశీలించిన అంశాలపై చర్చించారు. మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు వెలిగొండరెడ్డి, ఆదిత్య, సూపర్‌వైజర్లు దిలిప్‌కుమార్, శ్రీనివాసరావు, సుభాషిణి, ధనలక్ష్మి, ఎంపీహెచ్ఎస్ విజయ్‌కుమార్, పీహెచ్ఎన్ దుర్గాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలులో 5.50 కిలోల గంజాయి స్వాధీనం



దాచేపల్లి: రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామని జీఆర్పీ ఎస్‌ఐ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీన సహర్లగన్ నుంచి చర్లపల్లి వెళ్లుతున్న ప్రత్యేక రైలులోని ఏ1 ఏసీ కోచ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లుగా జీఆర్పీ పోలీసులకు సమాచారం అందిందన్నారు. పిడుగురాళ్ల ఆర్పీఎఫ్ పోలీసులతో పాటుగా నడికుడి జీఆర్పీ పోలీసులు ప్రత్యేక రైలుని నడికుడిలో ఆపి తనిఖీలు చేపట్టారని, ఏ1 ఏసీ కోచ్‌లో లైట్ స్కై బ్లూ రంగు ఉన్న బ్యాగ్‌లో 3 ప్యాకెట్లలో 5.50 కేజీల గంజాయి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని సరఫరా చేసే నిందితుడి ఆచూకీ కోసం గాలించినా లభ్యంకాలేదన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు నాయక్ చెప్పారు. ఆర్పీఎఫ్ ఎస్‌ఐ హుస్సేన్, జీఆర్పీ రైటర్ సరికొండ రామరాజు, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు తదితరులున్నారు.

వైభవంగా అచ్చమ్మ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల



అచ్చంపేట: ఉగాది ఉత్సవాలలో భాగంగా గ్రామదేవతైన అచ్చమ్మ పేరంటాళ్లమ్మ దేవాలయంలో శనివారం రెండవరోజు తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి వేకువజామునే ప్రాతఃకాలపూలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేతపండితులు అమ్మవారికి వేదమంత్రోచ్చారణల నూతన వస్త్రాలంకరణ, కుంకుమ పూజ, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత సహస్రనామ పారాయణ చేశారు. మహానైవేద్య నివేదన, కర్పూర హారతి, మత్రపుష్పం, తీర్థప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు సూరే వెంకట సుబ్బారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మా ఎంపీటీసీలను కాపాడుకుంటాం

- వైస్రాయి హోటల్లో క్యాంపు రాజకీయాలు నడిపిన పార్టీ వాళ్లు మాకు నీతులు చెప్పడం శోచనీయం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: తమ పార్టీ ఎంపీటీసీలను కాపాడుకోవటం తమ బాధ్యతని, ఆపని చేసినందుకు తనకు గర్వంగా ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తాను ఎంపీటీసీలను నిర్బంధించానంటూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తనపై చేసిన వ్యాఖ్యలు అతని రాజకీయ అపరిపక్వతకు నిదర్శనంగా, హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఆనాడు ముఖ్యమంత్రి అయ్యేందుకు చంద్రబాబునాయుడు వైస్రాయ్ హోటల్‌లో ఎమ్మెల్యేలతో క్యాంపు నిర్వహించిన విషయం గుర్తుచేసుకోవాలని అరవిందబాబుకు సూచించారు. క్యాంపులు నిర్వహించటమనేది రాజకీయాల్లో సర్వసాధారణమన్నారు. నరసరావుపేట మండల ఉపాధ్యక్ష పదవిని గెలిపించుకునేందుకు మొత్తం 16 మందిలో తమవైపు 12ఎంపీటీసీలు ఉన్నారన్నారు. వారిని పోలీసులతో నిర్బంధించి తప్పుడు కేసులు పెట్టి భయాందోళనలకు గురిచేసి తమవైపుకు తిప్పుకునేందుకు డాక్టర్ చదలవాడ ప్రయత్నించారన్నారు.

హెబియస్ కార్పస్ పిటిషన్ వేసిన తర్వాతే వదిలారు..

ఎమ్మెల్యే నీతిమంతుడైతే ఎంపీపీ భర్త మోరబోయిన శ్రీనివాసరావు, మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావులను పోలీసులు ముందుగానే తమ అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌లో ఎందుకు నిర్బంధించారని డాక్టర్ గోపిరెడ్డి ప్రశ్నించారు. తాము హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయగానే వారిని వదిలేశారన్నారు. తాము ఎన్నికలను బాయ్‌కాట్ చేయకుండా ఎంపీటీసీలతో మండల కార్యాలయం వద్దకు వస్తే వారిని బలవంతంగా అపహరించేందుకు మార్గ మధ్యలో పోలీసులు, వందలాదిమంది పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే వ్యూహరచన చేశాడన్నారు. చివరకు తమ కార్యాలయం చుట్టూ నిఘా ఏర్పాటు చేయించాడన్నారు. ఎంపీటీసీలను కార్లలో అపహరించేందుకు ఆ కార్ల నంబర్ ప్లేట్లకు పసుపు రంగు పూయించాడని చెప్పారు.

ఎప్పుడు ఎన్నిక జరిగినా మాదే విజయం

పార్టీపైన, తనపైన ఉన్న అభిమానంతో ఎంపీటీసీలు అందరూ తనవద్దే ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తామే గెలుస్తామని డాక్టర్ గోపిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యక్ష పదవిని గెల్చుకోనందుకు ఆ పార్టీ అధిష్టానం చదలవాడకు చివాట్లు పెట్టిందన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎంపీటీసీలను తీసుకొని రావాలంటూ చదలవాడ విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, ఈసారి ఎన్నికల సందర్భంగా తన ఎంపీటీసీలతో వస్తానని, పార్టీ కార్యకర్తల సమీకరణ చేయకుండా ఎమ్మెల్యే కూడా తన ఎంపీటీసీలతో ఒక్కడే రావాలని సవాల్ విసిరారు. తమకు భద్రత కోసం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించనున్నట్లు పేర్కొన్నారు.

డ్రగ్స్ నివారణకు 'ఈగల్ క్లబ్స్'

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు
- జిల్లా ఎస్పీతో కలిసి నార్కోటిక్స్ నియంత్రణ సమన్వయ సమావేశం



రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ సంస్థ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: జిల్లాలో ఈగల్ క్లబ్స్ ద్వారా డ్రగ్స్ నియంత్రణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ప్రతి కళాశాలలో ఔత్సాహిక విద్యార్థులు, తల్లిదండ్రులతో ఈగల్ క్లబ్ ఏర్పాటుచేసి విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగాన్ని నియంత్రించేందుకు కార్యక్రమాలు చేపడతామన్నారు. డ్రగ్స్ వినియోగంపై ఈగల్ క్లబ్స్ సమాచారం అందిస్తాయన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి నార్కోటిక్స్ నియంత్రణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆహ్లాదం కోసం కళాశాల విద్యార్థులు అవలంభిస్తున్న నూతన మార్గాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల ప్రవర్తనపై అవగాహన కోసం పోలీసు, ఎక్సైజ్ శాఖలు ప్రత్యేకంగా ఇంటిలిజెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాలేజీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, ఆర్డీఓలు మధులత, మురళీకృష్ణ, డీఎంహెచ్ఓ రవి పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయండి..

జిల్లాలో వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ వాడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆశించిన స్థాయిలో హెల్మెట్ వినియోగించకపోవడం ఆందోళనకరమన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ కన్వీనర్ కనకదుర్గ పద్మజ, ఆర్అండ్‌బీ ఈఈ రాజానాయక్, ఆర్టీఓ మధులత, జిల్లా రవాణా అధికారి సంజీవకుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీ-4కు 500 మంది లబ్ధిదారులు ఎంపిక

పీ-4 కార్యక్రమానికి జిల్లా నుంచి 500 మంది లబ్ధిదారుల పేర్లను ఉగాది రోజున అమరావతికి పంపనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపైన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి 14 బస్సులను ఏర్పాటు చేసి లబ్ధిదారులను అమరావతికి పంపనున్నట్లు తెలిపారు. పేదరికంలో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, రైతులు, వేతన జీవులను, 500 మందిని పంపనున్నట్లు తెలిపారు. జిల్లాకు నోడల్ అధికారిగా డీఆర్ఓ ఏకా మురళిను నియమించామన్నారు. సీపీఓ మొబలైజేషన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తారని, డ్వామా పీడీ, డీఆర్‌డీఏ పీడీ, వ్యవసాయాధికారి లబ్దిదారులను ఎంపిక చేశారన్నారు. వేడుకలు అమరావతిలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన పేదరిక నిర్మూలన కార్యక్రమమే పీ-4 పాలసీ అన్నారు. లక్షల కుటుంబాల్లో ఎంపిక చేసిన కొన్ని కుటుంబాలను జీఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సర్వే చేశారన్నారు. సంబంధిత సిబ్బంది గ్రామసభ ద్వారా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న 20 శాతం కుటుంబాలను గుర్తించారన్నారు. జేసీ పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం

న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ

నరసరావుపేటటౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పలు ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. అందులో భాగంగా మండలంలోని యల్లమంద గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ పాల్గొని మాట్లాడారు. మహిళలు చట్టపరంగా వారికి ఉన్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు ఉన్న హక్కులను క్షుణ్ణంగా వివరించారు. ఉచితంగా న్యాయ సహాయం పొందే విధివిధానాలను వివరించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా మండల న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించి తగు న్యాయసహాయం పొందాల్సిందిగా ఆమె కోరారు. అదే విధంగా పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో గల హెచ్ఓసీ స్వచ్ఛంద సేవా సంస్థలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా న్యాయాధికారి ఎన్.సత్యశ్రీ పాల్గొని, మాట్లాడారు. పట్టణంలోని వరవకట్టలో గల కృష్ణవేణి నర్సింగ్ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.ఆశీర్వాదం పాల్ పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కులు, పోక్సో చట్టం, ఉచిత న్యాయ సహాయం పొందే విధి విధానాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో న్యాయవాదులు, కళాశాల ప్రిన్సిపాళ్లు, డీసీపీఓ శౌరి రాజు, గ్రామ పెద్దలు, రూరల్ ఎస్‌ఐ కిషోర్, పీఎల్‌వీలు, పోలీసులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ

మోటారు వాహన చట్ట నిబంధనలు కఠినంగా అమలు చేయండి

నరసరావుపేటటౌన్: మోటార్ వాహన చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయటంతో పాటు రోడ్డు ప్రమాదాలలో ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు, రవాణా శాఖ అధికారులకు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ సూచించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయవాదులు, పోలీస్, రవాణా శాఖ అధికారులకు మోటార్ వాహన చట్టంలో వచ్చిన నూతన నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్, వన్‌టౌన్ సీఐ ఎం.వి చరణ్, నరసరావుపేట ట్రాఫిక్ సీఐ సిహెచ్ లోకనాథం, ఏఎంవీఐ ఎం. నాగేశ్వరరావు, ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

- కూటమి అరాచకాలను మాజీ సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారనే కక్షతోనే సైదా, అల్లాభక్షుల అరెస్టులు
- గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్ల: మాచవరం మండలం ఇన్‌ఛార్జి ఎంపీపీ తనయుడు షేక్ చింతపల్లి పెద్ద సైదా, అల్లాభక్షుల అరెస్టు సరైనది కాదని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం ఆయన మాట్లాడారు. ఎక్కడో హైదరాబాద్‌లో చిన్న వ్యాపారం చేసుకుంటూ నివసిస్తున్న షేక్ సైదాను పోలీసులు అరెస్టు చేశారని తెలియవస్తుందన్నారు. అదేవిధంగా చిన్న అగ్రహారం గ్రామంలో ఉంటున్న అల్లాభక్షును కూడా అదుపులోకి తీసుకున్నారనే సమాచారం ఉందన్నారు. పిన్నెల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జరిగిన అరాచకాలు, వరుస ఘటనలను గత వారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కలిసి వారు వివరించటం జరిగిందన్నారు. స్పందించిన వైఎస్ జగన్ త్వరలోనే న్యాయం చేస్తామని వారికి తెలియజేశారన్నారు. దీనికి సంబంధించి హైకోర్టులో కేసు కూడా వేశారన్నారు. హైకోర్టులో కేసు వేయడం, అదేవిధంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లడంతో షేక్ సైదా, అల్లాభక్షులపై కూటమి ప్రభుత్వం కక్షకట్టి దొంగ కేసులు నమోదు చేశారని కాసు ఆరోపించారు. పిన్నెల్లి గ్రామంలోనే , అసలు రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణలో నివసిస్తున్న వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు కేసులు పెడుతున్న పోలీసులపై కూడా హైకోర్టులో ప్రైవేటు కేసులు తప్పకుండా వేస్తామని తెలిపారు. బాధితుల ఆచూకీ తెలపాలంటూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

సైదాపై ఏ కేసు పెట్టారో పోలీసులు చెప్పాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్

పిడుగురాళ్ల: మాచవరం మండలం ఇన్‌చార్జి ఎంపీపీ తనయుడు, వైఎస్సార్ సీపీ నేత షేక్ చింతపల్లి పెద్ద సైదాపై ఏ కేసు పెట్టారో పోలీసులు చెప్పాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. పిడుగురాళ్లలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన సైదా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడని, అదేవిధంగా వైఎస్సార్ సీపీ కార్యకర్త అల్లాభక్షు పిడుగురాళ్ల మండలం అగ్రహారం గ్రామంలో నివాసం ఉంటున్నారన్నారు. అయితే ఎవరికీ తెలియకుండా పోలీసులు వారిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉంటున్నామని, ఇప్పుడు ఎందుకు అరెస్టు చేస్తున్నారో, ఏ కేసులో అరెస్టు చేస్తున్నారో చెప్పాలని ఇరువురూ వేడుకున్నా చెప్పకుండా పోలీసులు గురజాల, మిగతా పోలీస్ స్టేషన్లు చుట్టూ వారిని తిప్పుతున్నట్లు తెలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. వారి ఆచూకీ తెలీక కుటుంబ సభ్యులు ఆందోళన పడుతున్నారన్నారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించి హెబియెస్ కార్పస్ పిటిషన్ వేస్తామని, అదేవిధంగా పోలీసులపై కూడా ప్రైవేటు కేసులు వేస్తామని తెలిపారు.



క్లుప్తంగా

పీఆర్కే ఉగాది శుభాకాంక్షలు



మాచర్ల: జిల్లా ప్రజలంతా శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాదిని ఘనంగా జరుపుకొని భగవంతుని ఆశీస్సులు పొంది, ఏడాది మొత్తం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ నూతన ఏడాది అంతా శుభమే జరగాలని కోరుకుంటూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలు, పోలీసు సిబ్బందికి ఎస్పీ ఉగాది శుభాకాంక్షలు

నరసరావుపేట: జిల్లా ప్రజలు, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. ఉగాది తెలుగువారికే ప్రత్యేకమైన పండుగ అన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు తేవాలని ఆకాంక్షించారు.

డీజీపీ కార్యాలయం వద్ద యువకుడు ఆత్మహత్యాయత్నం

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ ఆత్మకూరులోని డీజీపీ కార్యాలయం వద్ద శనివారం ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అతడ్ని స్టేషన్‌కు తీసుకువచ్చారు. సేకరించిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం ముస్తపల్లి గ్రామానికి చెందిన రమాకాంత్ హైదరాబాద్‌లో కారు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన తల్లి అయిన జాకీర్ లక్ష్మీబాయిపై చిన్నాన్న రాజు పొలం విషయంలో దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టాడని రమాకాంత్ తెలిపాడు. అక్కడ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పట్టించుకోకపోగా, తనపై రౌడీషీట్ తెరుస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించాడు. నంద్యాల ఎస్పీని సంప్రదించినా తనకు న్యాయం జరగలేదని, అందుకే ఈ ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు రమాకాంత్ తెలిపాడు.

నేడు అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

- 8 విద్యుత్ ప్రభలు ఏర్పాటు
- భారీ పోలీసు బందోబస్తు

శావల్యాపురం: ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని శానంపూడి గ్రామ శివారు బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు నేడు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవదాయ అధికారి యం.సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచిన తిరునాళ్ల సందర్భంగా గత వారం రోజుల నుంచి వివిధ గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని పొంగళ్లు పొంగించటం పాటు మూగ జీవాలను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్నారన్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు క్యూలైను ఏర్పాటు చేశామన్నారు. తిరునాళ్ల వేడుకలకు ముగ్గురు సీఐలు, 12 మంది ఎస్ఐలు 150 మంది పోలీసు సిబ్బంది పటిష్టమైన బందోబస్తును పోలీసు శాఖ ఏర్పాటు చేసిందన్నారు. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన వారు 8 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభలపై మైకులు నిషేధమన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు విజయవంతమయ్యేలా ప్రజలందరూ సహకరించాలన్నారు.



అమ్మవారి మూల విరాట్

- జిల్లా కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు

నరసరావుపేట: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది అందరి జీవితాల్లో నూతన ఉషస్సులు తేవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆకాంక్షించారు. ఈమేరకు జిల్లా ప్రజలకు శనివారం ఆయన ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిమ్స్‌లో ఉద్యోగాలు పేరిట టోకరా

- రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
- 11 మంది నుంచి రూ. 11లక్షలు వసూలు



రూరల్ స్టేషన్ వద్ద బాధితులు

మంగళగిరి: నగర పరిధిలోని ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ యువకులకు ఓ మోసగాడు రూ. 11లక్షలకు టోకరా వేసిన ఘటన చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడేపల్లి డోలాస్ నగర్‌కు చెందిన రావూరి నగేష్ ఎయిమ్స్‌కు గ్రావెల్ తోలే టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన గూడూరి ప్రసాద్ అమరావతిలో నివాసముంటూ రిపోర్టర్‌గా చలామణీ అవుతున్నాడు. నగేష్, ప్రసాద్‌కు కుటుంబపరంగా పరిచయాలున్నాయి.ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఉన్నాయని, రూ. లక్ష ఇస్తే ఉద్యోగం వస్తుందని ప్రసాద్ నమ్మబలికాడు. దీన్ని నమ్మిన నగేష్ తన ఇంటి చుట్టుపక్కల ఉన్న 10 మంది యువకులతో రూ. 10లక్షలను ఇప్పించాడు. కమీషన్ ఇస్తాననడంతో నమ్మి కట్టించాడు. నగదు చెల్లించి ఏడాది గడుస్తున్నా ప్రసాద్ నుంచి ఎలాంటి సమాధానం లేదు. అడిగితే తాను రిపోర్టర్‌నని, తనను ఎవరు ఏమి చేయలేరని, కేసు పెట్టుకున్నా ఏమీ కాదంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో నగేష్ బాధితులతో కలిసి శనివారం రూరల్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కళారత్న, ఉగాది పురస్కారాలకు పలువురి ఎంపిక

నగరంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పర్వదినాన బహూకరించనున్న కళారత్న అవార్డుకు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ఎంపికయ్యారు. డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం (నృత్యం), సోమంచి విజయ్‌కుమార్ (పెయింటింగ్), కావూరు సత్యనారాయణ, చిట్టినేని లక్ష్మీనారాయణ (కళలు), డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ (మెడిసిన్ సోషల్ సర్వీస్) చిట్టిపోతు మస్తానయ్య (సోషల్ సర్వీస్), పాత్తూరి రంగారావు (సాంస్కృతిక సేవలు), ఉగాది పురస్కారాలకు డాక్టర్ ఐ.లావణ్య, రాజాహుస్సేన్, రొక్కం కామేశ్వరరావు (అధ్యాపకులు) నల్లక శ్రీనివాసరావు (కళలు) డాక్టర్ గోళ్ల రామకృష్ణ (సహాయ ఆచార్యులు, మెడికల్ కళాశాల) డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మురికిపూడి దేవపాల్ (సామాజిక సేవలు) ఎంపికయ్యారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.